# అధికారులు జాగ్రత్తగా పనిచేయాలి




ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తు స్వీకరణపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ యూసీడీ ప్రాజెక్టు అధికారి యుగేంధర్‌రెడ్డి, హాజరైన జీహెచ్‌ఎంసీ సిబ్బంది

- ఆరు గ్యారంటీల దరఖాస్తు స్వీకరణపై అవగాహన సదస్సు
- నియోజకవర్గ పరిధిలో 28 కౌంటర్లు ఏర్పాటు

సైదాబాద్/బండ్లగూడ/మణికొండ/చాదర్‌ఘాట్, డిసెంబర్ 26 : ప్రజా పాలనలో భాగంగా ఆరు గ్యారంటీలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణలో అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని మలక్‌పేట నియోజకవర్గం నోడల్ అధికారి కృష్ణ తెలిపారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్ పద్మావతి కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా పాలన– ఆరు గ్యారంటీల అమలుపై జీహెచ్‌ఎంసీ సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని ప్రతి డివిజన్‌లో 4కేంద్రాల చొప్పున 6 డివిజన్లకు కలిపి 28 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డివిజన్ల వారీగా కౌంటర్లను ఏర్పాటు చేసే ప్రదేశాలను గుర్తించి అధికారులను నియమించామని, నియామకమైన అన్ని బృందాలు సక్రమంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి డివిజన్ పరిధిలో నాలుగు ప్రాంతాల్లో కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, వార్డు ఆఫీసులు, కమ్యూనిటీ హాళ్లు, మల్టీపర్పస్, ఫంక్షన్ హాళ్లు, ఇతరత్రా భవనాల్లో కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక బృందాలకు చెందిన



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్

సభ్యులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు దరఖాస్తులను అందజేయాలన్నారు. అదే విధంగా దరఖాస్తులను స్వయం సహాయక సభ్యులు ఇంటి వద్దకు వచ్చి స్వీకరించి, వాటికి సంబంధించిన రసీదు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.జయంత్, యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో..**

బండ్లగూడ: ప్రజా పాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో డివిజన్ల వారీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్లలో నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు, ప్రతి వార్డు కార్యాలయంలో ఒక కౌంటర్ ఉంటుందని, మిగితా మూడు కౌంటర్లు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ప్రజా పాలన కార్యక్రమానికి రాజేంద్రనగర్ సర్కిల్‌కు మంగతాయారును నియమించారన్నారు. ఈఈ నరేందర్‌గౌడ్, ఏసీపీ కృష్ణ మోహన్, డీపీవో రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి**

మణికొండ : సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు నార్సింగి మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ జి.శివారెడ్డి తెలిపారు. కోకాపేట్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాల నమోదు ప్రక్రియ కోసం ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన నిర్వహిస్తున్నామన్నారు. కోకాపేట్ కమ్యూనిటీహాల్‌లో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్ ఫొటోలతో వచ్చి కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**మలక్‌పేట స్పెషల్ అధికారిగా కృష్ణ**

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్‌గా జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్(అర్బన్ బయో డైవర్సిటీ)వీ.కృష్ణ నియమితులయ్యారు. నియోజకవర్గంలో ప్రజాపాలన కేంద్రాల అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మలక్‌పేట సర్కిల్ పరిధిలోని ఏడు డివిజన్లలో 4 సెంటర్ల చొప్పున మొత్తం 28కేంద్రాల్లో ఐదు గ్యారంటీ స్కీం దరఖాస్తులను స్వీకరించనున్నారు. సైదాబాద్, ముసరాంబాగ్, పాతమలక్‌పేట, అక్బర్‌బాగ్, ఆజంపురా, చావునీ, డబీర్‌పురా డివిజన్ల వారీగా నాలుగేసి సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## కౌంటర్ల వివరాలు..

**సైదాబాద్ డివిజన్ పరిధి :** సైదాబాద్ డివిజన్ వార్డు ఆఫీస్, జాకీరు హుస్సేన్ కాలనీ కమ్యూనిటీ హాల్, ఆస్మాన్‌ఘడ్ గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, మూడు గుళ్లు జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్.

**మూసారాంబాగ్ డివిజన్ పరిధి :** మూసారాంబాగ్ వార్డు ఆఫీస్, ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్, మూసారాంబాగ్ రజక సంఘం హాల్, గడ్డి అన్నారం రాజీవ్ కమ్యూనిటీ హాల్.

**అక్బర్‌బాగ్ డివిజన్ పరిధి :** ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్, గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ వెనుక జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్, బకార్ బాగ్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్, పల్టన్ కమ్యూనిటీ హాల్.

**పాత మలక్‌పేట డివిజన్ పరిధి:** ప్రిన్స్ బాడీగార్డ్ కమ్యూనిటీ హాల్, సలార్ ఇ-మిల్లత్ కమ్యూనిటీ హాల్ వాటర్ ట్యాంక్ వద్ద, శంకర్‌నగర్ అంబేద్కర్ కమ్యూనిటీహాల్, అఫ్జల్‌నగర్ సలార్ మిల్లత్ కమ్యూనిటీ హాల్.

**అజంపురా డివిజన్ పరిధి :** అజంపురా వార్డు ఆఫీస్, సోహెబ్ మెమోరియల్ లైబ్రరీ హాల్, కాలడేరా కమ్యూనిటీ హాల్, కమల్‌నగర్ కమ్యూనిటీ హాల్.

**చావునీ డివిజన్ పరిధి :** చావునీ వార్డు ఆఫీస్, గుడ్డిబౌలి కమ్యూనిటీ హాల్, ప్రిన్స్ దురిస్సేవర్ గర్ల్స్, చంచల్‌గూడ జూనియర్ కాలేజ్, డబిర్‌పురా వార్డు ఆఫీస్‌లో దరఖాస్తు స్వీకరణకు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

## గుర్తు తెలియని మహిళ మృతి

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 26: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళవారం జరిగింది. సీఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం..శంషాబాద్ పట్టణంలోని ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని గుడిసెలో మహిళ పడి ఉన్నట్లు డయల్ 100కు సమాచారం వచ్చింది. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా.. ఆమె అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని మహిళ(45) ఉంటుందని వివరించారు. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థి అదృశ్యం



సాయి(ఫైల్)

హయత్‌నగర్, డిసెంబర్ 26: విద్యార్థి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ హెచ్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్‌లోని వాసవి అపార్ట్‌మెంట్‌లో పర్వతరెడ్డి కుమారుడు సాయి సంజయ్ (12), శ్రీచైతన్య స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి బుక్ స్టాల్‌కు వెళ్లిన సాయి సంజయ్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు కుమారుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు సాయి సంజయ్ ఆచూకీ కోసం సీసీ టీవీ పుటేజీల ద్వారా దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్, తదితరులు

- ఆటో యూనియన్ అధ్యక్షుడు చింతల నందకిశోర్
- శంషాబాద్‌లో ర్యాలీ తీసిన ఆటో కార్మికులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 26:ఆటో కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని బీఎంఎస్ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ హెచ్చరించారు. మంగళవారం ఆటో యూనియన్, బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు శంషాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్ మాట్లాడుతూ.. తెలంగాణ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడంతో ఆటో కార్మికులకు జీవనోపాధి పూర్తిగా దెబ్బతిని అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆటో కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా వారి నుంచి ఎలాంటి స్పందన రావడంలేదని ఆరోపించారు. ఆటో కార్మికులకు న్యాయం చేయనిచో మరింత ఆందోళనను చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎండీ సయ్యద్, రవి, శ్రీను, జగదీశ్, శివ, దర్శన్, శ్రీశైలం, నర్సింహ గౌడ్, సురేశ్, శేఖర్, సలీం, ఫిరోజ్, ఫయాజ్, కృష్ణ, శ్రీను, రంజీత్, లడ్డూ, మాణిక్, రమేశ్, ప్రవీణ్, నాగప్ప చారి, మల్లేశ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## షాదాన్ కళాశాలలో ఘనంగా పల్‌సెషన్‌డే

బండ్లగూడ, డిసెంబర్ 26: షాదాన్ కళాశాలలో 'పల్‌సెషన్‌డే-2023' ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం ఏడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాలను మంగళవారం షాదాన్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ షాదాన్ తేనియత్ బెలూన్‌లను ఎగురవేసి ప్రారంభించారు. డిసెంబర్ 26 నుంచి జనవరి 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ప్రతి రోజు సమాజిక సేవలకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా రక్తదానం, స్వచ్ఛ భారత్, ఫుడ్ ఫెస్ట్‌లను చేశారు. అనంతరం విద్యార్థులు పలు నృత్యాలతో ఆడిపాడారు. షాదాన్ కళాశాల మెడికల్ సైన్స్ డీన్ డాక్టర్ జగన్‌మోహన్, వీఆర్‌కే ఉమెన్స్ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ కె.విజయల్, అయాన్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సైన్స్ డీన్ డాక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బెలూన్‌లను ఎగురవేసి ప్రారంభిస్తున్న షాదాన్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ షాదాన్‌తేనియత్



## పండుగలు ఆధ్యాత్మికతను పెంచుతాయి

సైదాబాద్ కాలనీలోని బేతేల్ ప్రార్ధనామందిరంలో మంగళవారం క్రైస్తవ సోదరులకు కిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. బేతేల్ ప్రార్ధనా మందిరం అధ్యక్షుడు డాక్టర్ కేఆర్ పద్మారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని మతాలకు చెందిన పర్వదినాలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. బేతేల్ ప్రార్థన మందిరం ప్రతినిధులు కె.సుదర్శన్‌రావు, ఆర్.నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. *– సైదాబాద్, డిసెంబర్ 26*

## సింగరేణికాలనీలో సీపీఐ జెండా ఆవిష్కరణ

సైదాబాద్, డిసెంబర్ 26 :సీపీఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం సింగరేణికాలనీలో ఏర్పాటు చేసిన సీపీఐ జెండాను సీనియర్ నాయకులు ఆర్. శంకర్‌నాయక్ ఎగురవేశారు. డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, నాయకులు అంజయ్య, దశరథ్, మహిళా నాయకురాలు సక్రీబాయి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షుడిగా బండి గోపాల్‌యాదవ్



శంషాబాద్ రూరల్, డిసెంబర్ 26 : శంషాబాద్ అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షుడిగా, శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అయ్యప్పసేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌గుప్త తెలిపారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్పసేవ సమితి ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ ఇప్పునూతల అజేయ్‌తోపాటు పలువురు నాయకులు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

## మల్కారంలో నూతన గోదాం నేడు ప్రారంభం

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 26 : శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గోదాంను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బుధవారం ప్రారంభిస్తారని సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీశ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బండ్లగూడ, డిసెంబర్ 26: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చార్మినార్ తలాబ్‌కట్ట జహంగీర్ నగర్‌కు చెందిన సయ్యద్ అబ్రార్ మొహినుద్దీన్ (24) మదర్సాలో ఉంటూ చదువుకుంటున్నాడు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో అతడు మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు వెళ్తుండగా పీవీ నరసింహా రావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 245 వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## విజ్ఞాన విహార యాత్రతో ఎంతో ఉపయోగం

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 26: విజ్ఞాన విహార యాత్రలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుపతి అన్నారు. పాఠ్యాంశాల్లో విద్యార్థులు చదువుకున్న ప్రాంతాలు, ప్రదేశాలు, సరిహద్దులు, సముద్ర తీర ప్రాతాలు ప్రత్యేక్షంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి చూసేందుకు విద్యార్థులు ఇష్టపడుతారన్నారు. విద్యార్థుల ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులతో కలిసి మూడు రోజుల సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విజ్ఞాన విహార యాత్ర చేపట్టామన్నారు. మొత్తం 63 మంది విద్యార్థులతో అమరావతి, మంగళగిరి, విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవాలయం, ద్వారకా తిరుమల సింహాచలం, వైజాగ్‌లో ఉన్న బీచ్‌లతో ఈ విహార యాత్ర కొనసాగిందన్నారు. ఈ విహార యాత్రలో ఉపాధ్యాయులు నవారు మాణిక్యంరెడ్డి, జాన్సన్, గోపాలకృష్ణ, కంప్యూటర్ ఇన్‌స్పెక్టర్ వైష్ణవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

